ఖైరతాబాద్ @150



జోనల్ పరిధిలో డెంగీ హాట్‌స్పాట్‌ల గుర్తింపు

- అనుమానిత ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్న సిబ్బంది
- తూతూమంత్రం చర్యలే అంటున్న బస్తీవాసులు
- మరోవైపు మురుగు, చెత్తతో విజృంభిస్తున్న దోమలు
- డెంగీ బారిన పలువురు బస్తీవాసులు



ఫిలింనగర్ వినాయకనగర్‌లో పిచికారీ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

బంజారాహిల్స్: ఏటా లాగే ఈ వర్షాకాలంలోనూ దోమలు విజృంభించి డెంగీ కేసులు నమోదవుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. బస్తీల్లో పారిశుధ్య లోపంతో ఇప్పటికే పలువురు మలేరియా, టైఫాయిడ్‌తో మంచం బారిన పట్టగా తాజాగా డెంగీ కేసులతో మరింత ఆందోళన చెందుతున్నారు. అయినా దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది తూతూమంత్రంగా పిచికారీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ ఏడాది మొత్తం డెంగీ హాట్‌స్పాట్‌లు 800 గుర్తించగా, ఇందులో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో 150 ప్రాంతాల్లో డెంగీ అనుమానిత కేసులు ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ రికార్డులు వెల్లడిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చార్మినార్ జోన్ తర్వాత ఖైరతాబాద్ జోన్ రెండో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో సోమాజీగూడ, ఖైరతాబాద్, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లు ఉన్నాయి.
- జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు ఉన్నాయి.
- ఇదే జోనల్ పరిధి కిందికి కార్వాన్, మెహిదీపట్నం, గోషామహల్ సర్కిళ్లు కూడా వస్తాయి.
- ప్రతిరోజూ ఆయా సర్కిళ్ల ఎంటమాలజీ సిబ్బంది బస్తీలకు వెళ్లి యాంటీ లార్వా పిచికారీ చేస్తున్నారు. అయితే అది కూడా తూతూమంత్రంగా చేపట్టి జారుకుంటున్నారని, దీంతో దోమల నివారణ సాధ్యపడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ప్రతిరోజూ జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడడంతో పాటు వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుని దోమల నివారణకు పిచికారీ చేస్తున్నారో లేదో పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఇదెక్కడా అమలవుతున్నా సూచనలు కనిపించడం లేదు.
- పర్యవేక్షణ లోపంతోనే దోమలను కట్టడి చేయలేకపోతున్నారని, దీంతో బెడద మరింత తీవ్రమవుతుందని బస్తీవాసులు అంటున్నారు.
- 3 రోజుల క్రితం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని కార్పొరేటర్ నివాసం ఉండే వినాయకనగర్ బస్తీలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి.
- ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో పెద్ద ఎత్తున మురుగు పారుతూ దోమలు స్వైరవిహారం చేస్తుండగా దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి

- తమ నివాస ప్రాంగణాల్లో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి.
- పాతబడ్డ డ్రమ్ములు, పాడుబడ్డ కుండలు, ఇతర పాత సామగ్రిని బయటపడేయాలి.
- కొబ్బరి చిప్పలు ఇంట్లో పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు చెత్తలో పడేయాలి.
- అలాగే ఇంట్లో నీరు నిల్వ ఉండాకుండా చూసుకోవాలి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో కొబ్బరి నూనెను చల్లడం ద్వారా చాలా వరకు అరికట్టవచ్చు.
- డ్రైనేజీలు, మురుగు కాలువల నుంచి నీరు ముందుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- సాయంత్రం 6 గంటలకే కిటికీలు, తలుపులు మూసేయడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా చూసుకోవచ్చు.
- సెప్టిక్ ట్యాంక్‌లపై బట్టలు అడ్డుగా పెట్టడం ద్వారా దోమలు బయటకు రాకుండా అరికట్టవచ్చు.
- ఇళ్లలోని చెత్తను ఎప్పటికప్పుడు చెత్త కుప్పల్లో పడేయాలి.
- జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు తమ నివాసాల ముందు, ప్రాంగణాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించుకోవాలి.
- జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది కూడా నాలాలు, చెరువులు ఉన్నచోట గంబూషియా చేపలు వదలాలి.
- డోర్–టు–డోర్ సర్వే కోసం వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించి తమ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించుకోవడంతో పాటు స్ప్రే కూడా చేయించుకోవాలి.

ఇకపై 24/7 డ్రంకన్ డ్రైవ్

అలీకేఫ్ చౌరస్తాలో ఉదయం ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్, ఇతర అధికారులు

అంబర్‌పేట: రోడ్డు ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ విభాగం ప్రత్యేక దృష్టి సారించిందని ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్ తెలిపారు. వాహనదారులు గమ్యానికి క్షేమంగా చేరేలా తమ వంతు చొరవ తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి ఇతరులకు సైతం సహకరించాలని ఆయన సూచించారు. మంగళవారం కాచిగూడ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని అలీకేఫ్ చౌరస్తాలో డ్రంకన్ డ్రైవ్ ఇతర తనిఖీల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. డీసీపీ డ్రంక్ డ్రైవ్ పరీక్షలు చేస్తుండగానే ఓ వాహనదారుడు పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ... ఇకపై 24/7 డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపేతే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతిక్రమిస్తే ఎక్కడికక్కడ కట్టడి చేస్తామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాములు, ఏసీపీ కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి



దాశరథి చిత్రపటానికి నివాళులర్పించిన టీబీఎస్‌ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: నిజాం నిరంకుశ పాలనను సూటిగా ఎత్తిపొడుస్తూ రచనలు చేసిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని టీబీఎస్‌ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. మంగళవారం టీబీఎస్‌ఎస్ కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్య చిత్రపటానికి నివాళులర్పించిన మాట్లాడారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'అంటూ నిజాంను పిశాచిగా పేర్కొంటూ తెలంగాణ ప్రజలను తన రచనలతో ప్రపంచానికి తెలిసేలా చేశారన్నారు. నిజాం వ్యతిరేక రచనలకు ఆయనను జైలులో పెట్టగా అక్కడ కూడా అక్షర తూటాలు సంధించారని చెప్పారు. అలాగే ఎన్నో సినిమా గీతాలను సైతం రచించారన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్‌ఎస్ ఉపాధ్యక్షుడు చెన్నూరి లక్ష్మీనరసింహారావు, వర్కింగ్ ప్రసిడెంట్ ఊరే ప్రసాద్‌రావు, గూడా రాజేశ్వరరావు, గూడ జయరాం, సర్వ రఘు, దేవులపల్లి అశోక్‌కుమార్, మల్ల రంగాసాయి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 21న సంగారెడ్డి జిల్లా నాగల్గిద్ద, మొర్గి ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో చికెన్ తిన్న అనంతరం 11 మంది ఇంటర్ విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థకు గురై ఆస్పత్రి పాలయ్యారని పేర్కొన్నారు. అదే విధంగా మంచిర్యాల జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం తినడంతో ముగ్గురు విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. సంగారెడ్డి, మంచిర్యాల ఘటనలపై స్వతంత్ర విచారణ కమిటీ ద్వారా విచారణ చేపట్టాలన్నారు. హాస్టల్స్‌లో తాగునీరు, ఆహార నాణ్యత, మానవ వనరులపై సమగ్ర నివేదిక తయారు చేయాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలోని ఆహార నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక సర్వే కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

సామాజిక సేవ చేసినప్పుడే సమాజంలో గుర్తింపు



లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం రాంనగర్‌లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సభ్యులకు సర్టిఫికెట్లు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ వారి అవసరాలను తీర్చేందుకు బాధ్యతతో పని చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీఐ జాతీయ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పేదలకు నిత్యావసరాలు, పేద కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు వివాహాలకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.వీరేందర్, కోశాధికారి తులసీ రజినేష్, చీఫ్ అడ్వైజర్ శ్రీధర్, మీడియా సెల్ చైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు అజయ్‌గుప్తా, జి.శ్రీనివాస్, శ్రీకాంత్, వీరేషం, మహేష్, రాజు, హరికృష్ణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ న్యాయ సమ్మేళన్‌ను విజయవంతం చేయాలి



వీహెచ్‌తో బీసీ నాయకులు

అంబర్‌పేట: ఓబీసీ హక్కుల సాధనకు ఈ నెల 25 ఢిల్లీలో నిర్వహించనున్న న్యాయ్ సమ్మేళన్‌కు పెద్ద ఎత్తున తరలి రావాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ.హనుమంతారావు కోరారు. మంగళవారం ఆయన తన నివాసంలో కాంగ్రెస్ బీసీ నాయకులతో చర్చించారు. ఏఐసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమ్మేళన్ విజయవంతం అయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు సాధించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ తీర్మానం చేసిందన్నారు. పార్లమెంటులో బిల్లును పాస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, అఫ్సర్ యూసుఫ్ జాహి, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల కోసం ఆధార్ నమోదు శిబిరాలు



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఆధార్ నమోదు శిబిరంలో బయోమెట్రిక్ ఇస్తున్న విద్యార్థులు

కాచిగూడ: ఇండియా పోస్ట్, తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ, యుఐడీఏఐ సంయుక్తంగా ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థుల కోసం ఆధార్ నమోదు, నవీకరణ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించేందుకు మంగళవారం హైదరాబాద్, కాచిగూడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభ శిబిరాన్ని నిర్వహించారు. పోస్టాఫీస్ హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ జి.హైమావతి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ శిబిరాల ద్వారా విద్యార్థులు తాము చదువుతున్న కాలేజీల్లోనే ఆధార్ నమోదు లేదా బయోమెట్రిక్ నవీకరణ చేసుకునే అవకాశాన్ని పొందుతారు. ఇది స్కాలర్‌షిప్‌లు, పరీక్ష రిజిస్ట్రేషన్లు, ఇతర విద్యా సంబంధిత సేవల కోసం ఆధార్ తప్పనిసరి అయిన నేపథ్యంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 'ఇండియా పోస్ట్ విభాగం తరఫున, విద్యార్థులకు అవసరమైన సేవలను వారి కళాశాలలోనే అందించడం గౌరవంగా ఉందన్నారు. యుఐడీఏఐ, ఇంటర్మీడియట్ విద్యాశాఖతో కలిసి పని చేస్తూ ఆధార్ సేవలను తక్కువ సమయంలో, సులభంగా అందించగలగడం గొప్ప విషయమని అన్నారు. ఈ శిబిరం ఈనెల 23 వరకు కాచిగూడ జూనియర్ కళాశాలలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చిరంజీవి, పోస్టల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేక చర్యలు 'బీజేపీ' మానుకోవాలి

కాచిగూడ: బీసీ వ్యతిరేక చర్యలు బీజేపీ మానుకోకపోతే తెలంగాణలో ఆ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారాని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఢిల్లీలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చమని చెప్పడం బీసీల విద్రోహక చర్య అని ఆయన అన్నారు. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం సహకరించదని రాంచందర్‌రావు వ్యాఖ్యల ద్వారా గత కొన్ని నెలలుగా ఆడుతున్న ఆపార్టీ రాజకీయ నాటకానికి తెర తొలగిపోయిందని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, అందుకు ఒత్తిడి చేస్తున్న బీసీ ఉద్యమాలు, సహకరిస్తున్నట్లు నటిస్తున్న బీజేపీ నాటకాలు కీలక మైనదశలో తమ నిజ స్వరూపాలను బయట పెట్టుకొన్నారని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

గిఫ్ట్ ఏ స్మైల్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు కేసీఆర్ కిట్లను గిఫ్ట్ ఏ స్మైల్ పేరుతో ఆపదలో ఉన్న మహిళలకు తెలంగాణ భవన్‌లో అందించినట్లు రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బర్త్‌డే సెలబ్రేషన్స్ పేరుతో అనవసరంగా డబ్బు వృథా చేయొద్దని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఆజామ్ అలీ, గజ్జల నాగేష్, ఎంఎన్ శ్రీనివాస్‌రావు, సరిగిరిశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు సర్టిఫికెట్లు, పీకో మెషిన్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: మహిళలు స్వయం ఉపాధి శిక్షణా కోర్సులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. మంగళవారం చిక్కడపల్లి బాపునగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ , నివి చార్టిబుల్‌ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రం సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి లయన్స్ ప్రతినిధి కల్లూరి శ్రీనివాస్‌తో ఆమె ధ్రువీకరణ పత్రాలను, పీకో మెషిన్‌లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి సుమన్, కోశాధికారి విజయేందర్‌రెడ్డి, ప్రాజెక్ట్ చైర్మన్ గణేష్, సభ్యులు కమలాకర్, హేమంత్, ప్రకాష్ , బీజేపీ నేతలు దామోదర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అద్దంకిని నిలదీసిన నిరుద్యోగులు



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న నిరుద్యోగులు అడ్డుకున్నారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండేళ్లయినా ఉద్యోగ నోటిఫికేషన్లు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. ఉద్యోగాలు వద్దని నిరుద్యోగులు ధర్నా చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడం సరికాదన్నారు. ఎక్కడ ధర్నాలు చేశామో చూపించాలన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని దయాకర్ వారికి చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ దయాకర్‌కు ఉద్యోగ నోటిఫికేషను, జ్యాబ్ కేలండర్ ఇవ్వాలని వినతిపత్రం నిరుద్యోగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు శంకర్‌నాయక్, కృష్ణ, వెంకటేష్, శ్రీను, నరేష్, గణేష్, సలీం, దామోదర్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం త్వరగా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేసేలా కరుణించాలని అమ్మవారికి పూజలు చేశామని నిరుద్యోగులు శంకర్‌నాయక్, వెంకటేష్, నరేష్ తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భరత్ భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగాన్ని కేరళ ప్రభుత్వం తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టుగా పాఠ్యాంశాలలో చేర్చాలని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భరత్‌భూషణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల పరిరక్షణ సంఘం తెలుగు ఉమ్మడి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్ భూషణ్ మాట్లాడుతూ... రాజ్యాంగ విలువలు, హక్కులు, ప్రాథమిక సూత్రాలను ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.... 78 ఏళ్ల స్వాతంత్ర్య భారత్‌లో రాజ్యాంగ పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఒక ప్రత్యేక సబ్జెక్టుగా పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన కోరారు. డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్ మాట్లాడుతూ.... రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెబుతున్న రాహుల్ గాంధీ వారి పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణలో రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకులు జి.రాములు మాట్లాడుతూ... మనువాదాన్ని ప్రవేశపెట్టాలనే దుర్మార్గమైన ఆలోచనతోటే రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సమాజాన్ని శాసించే మనువాదాన్ని పక్కన పెట్టి సమాజంలో విలువలను పెంపొందించి భారత రాజ్యాంగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అందులో భాగంగానే పాఠ్యాంశాలలో చేర్చాలని అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంచింటి అంజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు గట్టు అశోక్, సలహాదారులు ఎం.నాగేశ్వరరావు, మేకపోతుల వెంకటరమణ, కోటా రమేష్, దొంటి లక్ష్మీనారాయణ, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ జిలకర శ్రీనివాస్, భైరీ వెంకటేష్, టి.రమేష్, పోకల కిరణ్, దయానంద్, ఐలయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

'పాఠ్యాంశాల్లో చరిత్రను తొలగిస్తే చరిత్ర హీనులవుతారు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాఠ్యాంశాలలో చరిత్రను తొలగిస్తే చరిత్ర హీనలవుతారని టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. చరిత్ర అధ్యాయనం లేకపోతే సమాజం గతం నుంచి నేర్చుకున్న విలువల్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే, టీపీటీఎల్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సీబీఎస్‌ఈ , ఎన్‌సీఈఆర్‌టీలలో చరిత్ర సిలబస్‌ను తొలగించి మతపరమైన హిందూ జాతీయవాద కథనాన్ని ప్రోత్సహించడం సరైంది కాదని విమర్శించారు. ప్రముఖ ప్రాంతాలు, కట్టడాలకు ఉన్న చరిత్రను, నెహ్రూ, ఇందిరాగాంధీల పేర్లను తొలగించడం ఘోరమైన తప్పిందమన్నారు. వందల ఏళ్ల మొగలుల పాలన చరిత్రను పుస్తకాల నుంచి తొలగించడం సరైంది కాదన్నారు. చరిత్రకు హిందూత్వ చెద పట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎల్‌ఎఫ్ అధ్యక్షుడు విజయ్, ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి నాగరాజు, రజిని కాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ రవిచారికి దత్తన్న పరామర్శ

ముషీరాబాద్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. రాంనగర్ డివిజన్ బాకారంలోని రవిచారి నివాసానికి మంగళవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వెళ్లారు. ఈ సందర్భంగా అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అన్నదానం

చిక్కడపల్లి: జవహర్‌నగర్ టీఆర్టీలోని వరాల పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పావని ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ పావనివినయ్‌కుమార్, నేతలు వి.నవీన్ కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, సత్తిరెడ్డి, సురేష్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, హన్మంతు, ప్రశాంత్, ఆలయ కమిటీ సభ్యులు కనకరాజు, శ్రీరామ్, యేసురత్నం, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో రోడ్లను ఆధునీకరించండి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని మండి గల్లీ వీధి, సందాని వీధి, సుప్రీం హోటల్ వీధిలో రోడ్లు అధ్వానంగా మారాయని బీఆర్‌ఎస్ నాయకులు, బస్తీ వికాస్ మంచ్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాంతాలలోని రోడ్లకు ఆధునీకరించాలని చేపట్టాలని మంగళవారం డీఈ సన్నీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం బీఆర్‌ఎస్ సీనియర్ నేత అక్లక్ హుస్సేన్, సంస్థ ప్రతినిధి మునావర్ చాంద్ మాట్లాడుతూ... డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వదిలేయడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక ప్రాంతాలలో పర్యటించి అధికారులను ఆదేశించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే రోడ్లను ఆధునీకరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అతిఖ్ ఉర్ రహమాన్, మహమూద్ హుస్సేన్, ముఖరమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిటీ లైబ్రరీ బోనాలు

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో ఆవరణలోని రేణుకాఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, సంస్థ కార్యదర్శి పద్మజల ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళ ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్, వెంకటేశ్‌యాదవ్, రామ్మోహన్‌రావు, బొల్లం మహేందర్, కృష్ణారెడ్డి, జానకీరామ్, సూర్యప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాదమ్మకు నివాళి

చిక్కడపల్లి: ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్ శ్రేణులను అన్ని విధాలుగా ఆదుకుంటూ వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. డివిజన్‌లోని అరుంధతినగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత అబ్రహం సతీమణి యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ యువనేత ముఠాజైసింహ మంగళవారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం అబ్రహంను పరామర్శించి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం చేశారు.

